క్లుప్తంగా

శ్రీవారికి సర్వభూపాల వాహనం సమర్పణ


శ్రీవారికి సమర్పించిన సర్వభూపాల వాహనం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్నకు ఒక దాత దంపతులు టేకు చెక్కతో కూడిన సర్వభూపాల వాహనాన్ని సమర్పించినట్లు ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి ఆదివారం తెలిపారు. తణుకుకు చెందిన మల్లె తిరుమల వెంకటరమణ, వరలక్ష్మీదేవి దంపతులు 120 కేజీల బరువు గల టేకు చెక్కతో కూడిన ఇత్తడి సర్వభూపాల వాహనాన్ని ఆలయంలో అధికారులకు అందజేశారు. అనంతరం అర్చకులు వాహనానికి పూజాధికాలను నిర్వహించారు.

విజయ్‌కు రన్నింగ్ ఫినిషర్ మెడల్



రన్నింగ్ ఫినిషర్ మెడల్‌ను చూపుతున్న విజయ్

ద్వారకాతిరుమల: విజయవాడలో రన్నర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ ఆదివారం నిర్వహించిన లాంగ్ రన్‌లో ద్వారకాతిరుమలకు చెందిన జాతీయ స్థాయి రోయింగ్ క్రీడాకారుడు ఊదర్ల విజయ్ పాల్గొన్నారు. 5 కేఎం, 10 కేఎం, 21 కేఎం రన్నింగ్‌ను నిర్వహించగా, 5 కేఎం రన్నింగ్‌లో పాల్గొన్న విజయ్, టాప్ టెన్‌లో నిలిచి, రన్నింగ్ ఫినిషర్ మెడల్ అందుకున్నాడు. ఈ లాంగ్ రన్ కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాలకు చెందిన రన్నర్స్ పెద్ద ఎత్తున పాల్గొన్నట్లు చెప్పారు. ఇదిలా ఉంటే జిల్లా స్కూలింగ్, రోయింగ్ అసోసియేషన్, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ ఎల్ ఏపీపీ డైరెక్టర్, తదితరులు విజయ్‌ను అభినందించారు.

శరవేగంగా గాలి గోపుర నిర్మాణం


నిర్మాణంలో ఉన్న గాలి గోపురం

కొయ్యలగూడెం: అంకాలగూడెం శ్రీ ఉమా సమేత భోగలింగేశ్వర స్వామి ఆలయ గాలిగోపుర నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. సుమారు రూ.45 లక్షల వ్యయంతో ఆలయ అభివృద్ధి పనులు పాలకమండలి ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే నిర్మించిన గాలి గోపురం నలువైపులా పలు దేవతా చిత్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాదాపు వంద వరకు శిల్పాకృతితో కూడిన దేవతామూర్తులను శిల్పుల చేత నిర్మిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా కార్తీక దీపాలంకరణ


కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

కొయ్యలగూడెం: కార్తీకమాసం సందర్భంగా ఆదివారం కంకర కోనేరు గట్టుపై ఉన్న శ్రీవిధమ్మ అమ్మవారి ఆలయంలో కార్తీక దీపాలంకరణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్ విగ్రహానికి ఎదురుగా శివలింగాకృతిలో దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. కార్తీక సోమవారం సందర్భంగా శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వేంచేసియున్న మీనాక్షి సుందరేశ్వర స్వామికి పంచామృత మహన్యాసపూర్వక అభిషేకం నిర్వహిస్తున్నట్లు పాలకమండలి పేర్కొంది.

సీపీఎం మహాసభలు


జెండా ఎగుర వేస్తున్న సీపీఎం నాయకులు

జంగారెడ్డిగూడెం: సీపీఎం జంగారెడ్డిగూడెం పట్టణ ప్రథమ మహాసభలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. 9వ వార్డు భానుమూర్తి నిలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆరేటి రామచంద్రం జెండాను ఎగుర వేశారు. ఎస్‌కే సుభాషిణి, యు.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, కార్యదర్శి వర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వంగ గోపి, చల్లారి మాణిక్యాలరావు, ఎం.జీవరత్నం, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రంలో వీధి శునకాల స్వైర విహారం

- వాహనాల వెంటపడుతూ బెంబేలెత్తిస్తున్న వైనం
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న స్థానికులు, భక్తులు


కుక్క కాటుతో గాయాలపాలైన బాధితుడు(ఫైల్)


ద్వారకాతిరుమలలో రహదారిపై స్వైర విహారం చేస్తున్న వీధి శునకాలు


ద్విచక్ర వాహనం వెంట పడుతున్న వీధి శునకాలు

ద్వారకాతిరుమల: మండల కేంద్రమైన ద్వారకాతిరుమలలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. నిత్యం ప్రజలను, భక్తులను బెంబేలెత్తిస్తున్నాయి. ఏ సమయంలో ఏ వైపు నుంచి వచ్చి దాడి చేస్తాయోనని హడలిపోతున్నారు. రోజురోజుకు శునకాల బెడద విపరీతంగా పెరిగిపోతుంది వీధుల్లో తిరుగుతూ మనుషులను వెంటాడి మరీ దాడులకు పాల్పడుతున్నాయి. నియంత్రణ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండటంతో సమస్య తీవ్ర రూపం దాల్చింది. ఒక్క ద్వారకాతిరుమలలోనే వందల సంఖ్యలో శునకాలు సంచరిస్తున్నాయి. మనుషులతో పాటు పశువులు, కోళ్లపై సైతం ఇవి దాడులకు పాల్పడుతున్నాయి.

పరిస్థితి దారుణం

క్షేత్రంలో స్వైర విహారం చేస్తున్న వీధి శునకాలతో పరిస్థితి దారుణంగా మారింది. ప్రతి వీధిలో వీటి బెడద తారా స్థాయికి చేరింది. వీటి బెడద దేవస్థానానికి సైతం ఎక్కువగా ఉండటంతో అప్పుడప్పుడు వాటిని పట్టి, దూర ప్రాంతాలకు తీసుకెళ్లి విడిచిపెడుతున్నారు. అయితే అవి మళ్లీ క్షేత్రానికి చేరుకుని ప్రజలపై దాడులు చేసి గాయాల పాలు చేస్తున్నాయి. ఇటీవల స్థానిక తూర్పు వీధిలో ఉప్పల కిరణ్ అనే వ్యక్తిపై, అలాగే జశ్వంత్ అనే 6 సంవత్సరాల బాలుడిపై వీధి శునకాలు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచాయి.

వాహనదారుల్లో భయం.. భయం

వాహనాలపై వెళ్తున్న వారిని ఈ శునకాలు వెంబడిస్తున్నాయి. దీంతో పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. క్షేత్రం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి ద్వారకాతిరుమలకు ద్విచక్ర వాహనాలపై వస్తున్న భక్తులు వీటి నుంచి తప్పించుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. రాత్రి వేళల్లో వీటి బెడద మరింత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు.

వ్యాక్సిన్ వేయించుకోవాలి



ప్రజలు కుక్క కాటుకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలి. ఒకవేళ ఎవరినైనా కరిస్తే వెంటనే వారు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి ర్యాబీస్ వ్యాక్సిన్‌ను తప్పకుండా వేయించుకోవాలి. వ్యాక్సిన్ వేయించుకోవడం ఆలస్యం చేసినా, అశ్రద్ధ చేసినా, అసలు వేయించుకోక పోయినా చాలా ప్రమాదం. ద్వారకాతిరుమల పీహెచ్‌సీలో ర్యాబీస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి.

ప్రవీణ్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యుడు, ద్వారకాతిరుమల

23న మండల స్థాయి క్విజ్ పోటీలు

కామవరపుకోట: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహించబడునని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడి భీమరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న ఉదయం 10 గంటలకు రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహిస్తామని మండలంలో ఆరో తరగతి నుంచి 10+2 చదివే విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. విజేతలకు నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేస్తామన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

బుట్టాయగూడెం: అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసి, దళితులపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. ఆదివారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. మధ్య ప్రదేశ్‌లోని విజయపూర్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో దళితులు బీజేపీకి ఓట్లు వేయలేదని వారిపై దాడిచేసి, అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. గోహ్త్ గ్రామంలో జరిగిన ఈ ఘటనలో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడంతో పాటు దళితుల ఇళ్లను తగులబెట్టడం మతోన్మాత, కుల దురహంకార చర్యని పేర్కొన్నారు. ఎన్నికల ముందే బెదిరింపులకు దిగిన, అక్కడి రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. దళితులు తీవ్రంగా గాయపడినా వారిని పరామర్శించక పోవడం, మెరుగైన వైద్యం అందించకపోవడం సిగ్గు చేటన్నారు. దాడిలో పాల్గొన్న వారందరిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: మండలంలోని తలార్లపల్లి గ్రామంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ఆదివా రం దాడులు నిర్వహించారు. దాడుల్లో రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. దేశావతు సైదా అనే మహిళపై పరారీ కేసు నమోదు చేసినట్లు పి.అశోక్ తెలిపారు. దాడుల్లో ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

చింతలపూడి: మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి ఒక కోడి పుంజు, రూ.4,140 నగదును స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎం.రవీంద్ర ఆధ్వర్యంలో ఎస్సై కుటుంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమాజ చైతన్యపరులు కళాకారులు


కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

కామవరపుకోట: సమాజ చైతన్యపరులు కళాకారులని జానపద కళాకారుల ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఆర్ కృష్ణబాబు అన్నారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల సమావేశంలో నేటి సమాజంలో కళాకారుల పాత్ర అనే అంశంపై ఇష్టాగోష్ఠి నిర్వహించారు ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు కళాకారులు వివిధ రూపాల ద్వారా ప్రజలను పలు అంశాలపై చైతన్య పరుస్తున్నారన్నారు. చారిత్రక, విప్లవాత్మక విశేషాలను ఎప్పటికప్పుడు ప్రజలకు కంటికి కట్టినట్టుగా చూపించే విధంగా కళాకారులు పాటు పడుతున్నారన్నారు. అనంతరం కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ కళాకారులు వీరమల్ల సత్యనారాయణ, టీవీఎస్ రాజు, శాఖా గ్రంథాలయ చైర్మన్ షేక్ ఇబ్రహీం, గ్రంథపాలకులు ఎం.భీమరాజు, వీరమల్ల మధు, తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీల అడ్డా.. గంగవరం మెట్ట


గంగవరం మెట్టపై సారా కాసేందుకు ఏర్పాటు చేసిన బట్టీ


సారాకు ఉపయోగించే బెల్లపు ఊట

కొయ్యలగూడెం: సారా బట్టీల నిర్వహణకు గంగవరం మెట్ట అడ్డాగా మారింది. రాజవరం పంచాయతీ పరిధిలోని గంగవరం కొంత అటవీ ప్రాంతం ఉంది. దీనిని అలుసుగా తీసుకుని అదే గ్రామానికి చెందిన కొందరు సారా బట్టీలను నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో వాలంటీర్ల వ్యవస్థ వలన అదుపులోకి వచ్చిన సారా బట్టీలు తిరిగి మళ్లీ పెరిగిపోయాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని కొందరు తిరం చెరువు సమీపం నుంచి జీడిమామిడి తోటల వరకు సారా బట్టాలను నిర్వహిస్తున్నారన్నారు. నిత్యం వెయ్యి నుంచి రెండు వేల లీటర్లకు పైగా కాపు సారా గంగవరం ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు రవాణా అవుతుందని, దీనిపై అభ్యంతరం తెలిపే రైతులకు బెదిరింపులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. తిరం చెరువుతోపాటు దళితవాడ నుంచి గంగవరం మెట్టపైకి వెళ్లే మారుమూల ప్రాంతాల్లో సారా బట్టీలు కొనసాగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖాధికారులు స్పందించి సారా నిర్వహణ అరికట్టాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

ఆదివాసీ హక్కులను తెలుసుకోవాలి


బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: ఆదివాసీ హక్కులను తెలుసుకున్నప్పుడే, మరింత రక్షణకు సాధ్యమవుతుందని ఆదివాసీ నాయకులు పేర్కొన్నారు. బుట్టాయగూడెంలో బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సాధికారత హక్కులు, చట్టాల అమలుపై, ఆదివాసీ మహిళా పేదరికం, విద్య, సమస్య సవాళ్లు పరిష్కారం అనే అంశాలపై సెమినార్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికాలో ఉంటున్న శాస్త్రవేత్త కొవ్వాసు సూర్యప్రకాష్ ప్రోత్సాహంతో ఆదివాసీ చట్టాల అమలు, హక్కులు తెలియజేయడం కోసం ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు, ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను, జేఏసీ చైర్మన్ మొడియం శ్రీనివాస్, ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు మడకం వెంకటేశ్వరరావు, ఏటీఏ రాష్ట్ర నాయకులు జలగం రాంబాబు, గౌరవ అధ్యక్షుడు తెల్ల రాములు, జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరావు, తెల్లం గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు


జంగారెడ్డిగూడెం: క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


ద్వారకాతిరుమల: ఆధునిక రచయితల గురించి వివరిస్తున్న ఉపాధ్యాయుడు

జంగారెడ్డిగూడెం: స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నాలుగో రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తిప్పాభట్ల రామకృష్ణ ఆధ్వర్యంలో సెమినార్లు, కవులు, రచయితల సందేశాలు విద్యార్థులకు వివరించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ నిర్వాహకుడిగా గ్రంథపాలకుడు సీఎం రాజు వ్యవహరించారు.

వ్యాసరచన పోటీలు

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆధునిక రచయితలు, వారి సందేశాలను శ్రీవారి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కాంతారావు ఆదివారం విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆధునిక రచయితలు కందుకూరి వీరేశలింగం, గుర్రం జాషువా, శ్రీశ్రీ, గురజాడ అప్పారావు, దాశరథి తదితరుల రచనలు, సాహిత్యం, కవితలు సమాజాన్ని సంస్కరించేవని కాంతారావు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారు పాప, గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి, తదితరులు పాల్గొన్నారు.

పేద కళాకారులకు ఆర్థిక సాయం


పేద కళాకారులకు సాయమందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పేద కళాకారులను ఆర్థికంగా ఆదుకునేందుకు ముందుకు రావడం అభినందనీయమని డీఆర్‌డీఏ పీడీ విజయరాజు అన్నారు. జంగారెడ్డిగూడెంలో పేద కళాకారిణి గొల్లపూడి చింతామణికి ఆదివారం ఆర్థిక సహాయాన్ని మానవత ఆధ్వర్యంలో అందజేశారు. నెక్స్‌జెన్ కళాతపస్వి అడుసుమిల్లి చంద్రశేఖర్ స్మారక ఆర్థిక పురస్కారం రూ.5000, పెదపాడు గ్రామానికి చెందిన నర్రా సుబ్బయ్య ఫౌండేషన్ తరఫున నర్రా బుజ్జి అందించిన రూ.1000 జంగారెడ్డిగూడెంకు చెందిన భజన కళాకారిణి, కోలాటం గురువు గొల్లపూడి చింతామణికి మానవత జిల్లా నాయకులు అడుసుమిల్లి నిర్మల ద్వారా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దువ్వి రామారావు, సెక్రటరీ బళ్ల బాబీ, కోశాధికారి నాట్యాచార్య దువ్వి హేమసుందర్ అందజేశారు.

నేడు నూకాలమ్మకు లక్ష దీపోత్సవం


లక్ష దీపోత్సవం వివరాలు తెలియజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీనూకాలమ్మ దేవస్థానంలో నిత్య పూజా కైంకర్యాలు భక్తి శ్రద్ధలతో శాస్త్రోక్తంగా అర్చక స్వాములు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు) మాట్లాడుతూ వాసవీ క్లబ్ అంతర్జాతీయ పూర్వపు అధ్యక్షుడు నాగేశ్వరరావు దంపతులు, స్థానిక పాత్రికేయ మిత్రులు అమ్మవారిని దర్శించుకున్నారన్నారు. 18వ తేదీ మూడో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని లక్ష దీపోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ నూకాంబిక సేవా బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు శ్రీనివాస శివకార్తికేయ కల్యాణం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోలని బుట్టాయగూడెం రోడ్‌లో కొలువైన శ్రీనూకాలమ్మ ఆలయంలో శ్రీరాజరాజేశ్వరీ త్రిశక్తి పీఠం వారి ఆధ్వర్యంలో 18వ తేదీ సోమవారం శ్రీనివాస శివ కార్తికేయ దివ్య కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహిస్తారని పీఠం నిర్వాహకులు మనోజ్ శర్మ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ సాయంత్రం నాలుగు గంటల నుండి 108 జంటలతో ఒకే వేదికపై ఈ కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మనోజ్ శర్మ విజ్ఞప్తి చేశారు. వివరాలకు కళ్యాణ వర్మ 7989427166 హనుమాన్ 9949742775 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నష్ట పరిహారం పెంచాలి


సమావేశంలో పాల్గొన్న రైతులు

చింతలపూడి: రైతులతో చర్చించిన తరువాతే చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ పనులు ప్రారంభించాలని రైతులు కోరారు. పథకంలో భూములు కోల్పోయిన రైతులు యర్రగుంటపల్లి రాధా గార్డెన్స్ కల్యాణ మండపంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సోవుశేఖర్ అధ్యక్షత వహించారు. రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ తమ ప్రాంతంలో భూమి విలువ రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉందని అందుకు అనుగుణంగా ఎకరాకు రూ.50 లక్షల నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు సీహెచ్ అంజిబాబు, దొంతా కృష్ణ, తెగడ వెంకన్న, కుప్పాల చెన్నయ్య, ఎం.సత్యన్నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా కలప అక్రమ రవాణా


గంగవరం అటవీ ప్రాంతంలో కలపను అక్రమంగా రవాణా చేస్తున్న దృశ్యం


కన్నాపురం-పులి రామన్నగూడెం రోడ్డులో కలపను అక్రమంగా రవాణా చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: అటవీ శాఖ పరిధిలోని ప్రాంతాల నుంచి అక్రమంగా కలప రవాణా యథేచ్ఛగా కొనసాగుతుంది. ఏజెన్సీ ప్రాంతాల మీదుగా కొనసాగుతున్న కలప అక్రమ రవాణాతో పాటుగా మండలంలోని గంగవరం అటవీ ప్రాంత సమీప నుంచి అక్రమార్కులు కలపను దొడ్డిదారిన తరలించుకుపోతున్నారు. వర్జీనియా బేరన్ సీజన్ మరో రెండు నెలల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే కలపను తరలించి ఆక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. అటవీ ప్రాంతాల్లో మారుజాతి కలప టన్ను రూ.3500 వరకు ఉండడంతో పొగాకు సాగు చేసే రైతులు ముందుస్తుగానే కలప కొనుగోలు చేసి జాగ్రత్త పరుచుకుంటున్నారు. కలపకు ప్రత్యామ్నాయంగా బొగ్గు ఉత్పత్తి అవుతున్నప్పటికీ బేరన్ క్యూరింగ్ చేసేందుకు రైతులు ఆసక్తి కనబరచకపోవడం వలన కలపకు భారీగా డిమాండ్ ఏర్పడింది. ట్రాక్టర్లపై కలపను అక్రమంగా రవాణా చేస్తూ అటవీశాఖ అధికారుల సిబ్బంది కళ్లుగప్పి, కొన్నిచోట్ల అక్రమార్కులతో అటవీశాఖ వారు లాలూచీ పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకు తగినట్టుగానే అక్రమ కలప రవాణా బహిరంగంగా పట్టపగలే జాతీయ, రాష్ట్ర ప్రధాన రహదారుల మీరుగా తరలి వెళుతుండడం ఆరోపణలకు బలం చేకూర్చుతున్నాయి. సామర్థ్యానికి మించి వాహనాలపై కలప అక్రమంగా తరలిస్తుండడంతో రహదారులు అధ్వానంగా ఉన్న చోట ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. సందిట్లో సడేమియా అన్నట్లు రహదారుల పక్కన ఉన్న చెట్లు నరికివేతకు గురవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల కలపను అక్రమంగా తరలిస్తూ వాహనాలు పట్టుబడినప్పటికీ రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో సాధారణ అపరాధ రుసుం విధించి వదిలేసినట్లు కన్నాపురం గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో కలప అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.